

భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 27.0
తణుకు : 33.0 - 26.0

మండలం	పెన్షన్‌దారులు	నిధులు
ఆచంట	8,182	3,41,54,500
ఆకివీడు	5,441	2,27,95,500
ఆకివీడు(అర్బన్)	3,275	1,37,34,500
అత్తిలి	9,618	4,17,04,500
భీమవరం	11,432	4,71,94,500
భీమవరం(అర్బన్)	11,319	4,86,72,000
గణపవరం	8,821	3,76,18,500
ఇరగవరం	9,499	3,98,06,000
కాళ్ళ	8,938	3,75,59,500
మొగల్తూరు	10,733	4,42,51,000
నరసాపురం	11,197	4,64,32,000
నరసాపురం(అర్బన్)	5,745	2,45,28,000
పాలకొల్లు	9,176	3,85,81,000
పాలకొల్లు(అర్బన్)	5,941	2,54,63,000
పాలకోడేరు	9,255	3,74,72,500
పెంటపాడు	9,898	4,23,88,500
పెనుగొండ	8,845	3,66,15,000
పెనుమంట్ర	8,388	3,48,67,500
పోడూరు	8,661	3,68,87,000
తాడేపల్లిగూడెం(అర్బన్)	9,335	4,21,04,500
తాడేపల్లిగూడెం	12,613	5,26,01,000
తణుకు	8,979	3,74,89,000
తణుకు(అర్బన్)	8,582	3,71,42,000
ఉండి	8,909	3,66,84,000
వీరవాసరం	8,658	3,64,57,500
యలమంచిలి	10,434	4,27,67,000
మొత్తం	2,31,874	97,25,50,000

నేడే పింఛన్ల పంపిణీ

- ఉదయం 6 నుంచి పంపిణీకి చర్యలు
- నూరుశాతం లక్ష్యంగా ఏర్పాట్లు

భీమవరం టౌన్, జూలై 31 : ఆగస్టు నెల ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీకి నిధులు విడుదల అయ్యాయి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ సొమ్మును బ్యాంకుల్లో జమ చేసింది. వాటిని సచివాలయ కార్యదర్శులు విత్‌డ్రా చేసుకున్నారు. జిల్లాలో ఆగస్టు నెలకు సంబంధించి రూ.97.26 కోట్లు విడుదల చేసింది. గత ప్రభుత్వంలో రూ.62 కోట్లు మాత్రమే భరించేది. అప్పట్లో మూడువేలు మాత్రమే ఇచ్చారు. వికలాంగులకు రూ.6వేలు పింఛన్ అందిస్తున్నారు. దాంతో ప్రభుత్వంపై అదనపు భారం పడింది. వృద్ధులకు ఇంటివద్దనే పింఛన్ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసకున్నారు. వలంటీర్ల లేకపోయినా గత నెలలో విజయవంతంగా లబ్ధిదారులకు ఎరియర్స్‌తో కూడిన పెన్షన్ అందించారు. ఈనెలకు కూడా జిల్లావ్యాప్తంగా పెన్షన్ పంపిణీకి 4,243 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. ప్రతీ ఉద్యోగికి 55 పెన్షన్‌లు పంపిణీ చేసేలా నిర్ణయించారు. పంపిణీలో సచివాలయ సిబ్బందితోపాటు ఇతర శాఖల నుంచి కూడా సిబ్బందిని నియమించారు. ఉదయం 6గంటలనుంచి సాయంత్రం 6 వరకు పెన్షన్‌లు పంపిణీ చెయ్యాలని నిర్ణయించారు. గత నెలలో జిల్లాలో 2,035 మంది పెన్షన్‌లు తీసుకోలేనట్లుగా అధికారులు నిర్ధారించారు. ఇందులో 1260 మంది చనిపోయినట్లుగా తేలింది. దీనిని తగ్గించే ఆగస్టు నెల పెన్షన్ సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఎరియర్స్‌పై అధికారులకు ఎటువంటి సమాచారం లేదు.

నూరు శాతం పంపిణీ చేయాలి : కలెక్టర్

జిల్లాలో 1వ తేదీన పింఛన్ల పంపిణీ లబ్ధిదారలకు ఇంటివద్దనే చెల్లించటానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మొదటి రోజు నూరుశాతం పంపిణీ పూర్తిచెయ్యాలన్నారు. ఈ విషయాన్ని ప్రతీ గ్రామం, వార్డుల్లో ముందస్తు ప్రచారం చేపట్టాలన్నారు. మత్స్య కారులు వేటకు వెళ్ళేఅవకాశం ఉన్నందున పింఛన్ పంపిణీ పై వారికి ముందస్తు సమాచారం అందించాలన్నారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండవ తేదీన పింఛన్లు అందిస్తారని చెప్పారు.



ధాన్యం డబ్బులు ఇవ్వాలంటూ ధర్నా



భీమవరం రూరల్, జూలై 31 : రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తక్షణమే ధాన్యం డబ్బులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రామాంజనేయులు మాట్లాడుతూ సార్వా నాట్లు పూర్తవుతున్నా దాళ్వా పంట డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జిల్లాలో ఇంకా 30వేల మందికి 450 కోట్ల రూపాయలు ఇవ్వాలన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా ఒక సీనియర్ అధికారి మాట్లాడుతూ తమకు సంబంధం లేదు, మీరు వెళ్ళి ముఖ్యమంత్రి దగ్గరో, ఉప ముఖ్యమంత్రి దగ్గరకో వెళ్లి ధర్నా చేయండి అనడంతో రైతులు ఆగ్రహంతో అధికారులను నిలదీశారు. పౌరసరఫరాలశాఖ జిల్లా డిప్యూటీ మేనేజర్ దుర్గారావు సమస్యను పౌరసరఫరాల శాఖ ఆర్థిక నిర్వహణ అధికారి నాగసుధారాణి దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా వారు నాయకులతో మాట్లాడి ఆగస్టు 5వ తేదీ లోపు ధాన్యం డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

ఇద్దరు డీఎస్పీల బదిలీ



డీఎస్పీలు నారాయణస్వామి రెడ్డి, శ్రీనివాసరావు

భీమవరం క్రైం/నరసాపురం, జూలై 31 : జిల్లాలో ఇద్దరు డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. భీమవరం డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో గన్నవరం డీఎస్పీగా పనిచేస్తున్న ఆర్‌జి జయసూర్యను భీమవరం డీఎస్పీగా బదిలీ చేశారు. నర్సాపురం డీఎస్పీ జి.శ్రీనివాసరావును కృష్ణా జిల్లా డీటీసీ డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఏపీఎస్పీ ఐదవ బెటాలియన్‌కు చెందిన ఎస్‌బీఎం మురళీకృష్ణను నియమించారు. భీమవరం డీఎస్పీగా వస్తున్న ఆర్‌జి జయసూర్య గతంలో భీమవరం టూటౌన్ సీఐగా విధులు నిర్వహించారు.

పెరిగిన రొయ్యల ధరలు

ముదినేపల్లి, జూలై 31 : మార్కెట్‌లో రెండు రోజులుగా రొయ్యల ధరలు కాస్త పెరిగి ఆశాజనకంగా ఉన్నాయి. అయితే రొయ్యల ఉత్పత్తులు తగ్గిన సమయంలో ధరలు ఉన్నట్టుండి పెరగడంతో ఆక్వా రైతులకు పెద్దగా ఊరట కలిగించలేదు. వంద కౌంట్ రొయ్యలు కేజీ ఒక్కింటికి రూ.240, 80 కౌంట్ రూ.260, 60 కౌంట్ రూ.300, 50 కౌంట్ రొయ్య ధర రూ.320కి పెరిగింది. నెల రోజులుగా మార్కెట్‌లో నెలకొన్న మాంద్యం వల్ల ఉత్పత్తులు ఉన్నా ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎక్కువగా మార్కెటింగ్ జరిగే వంద కౌంట్ రొయ్య ధర నాలుగు రోజుల క్రితం వరకు కేజీ రూ.200 ఉండగా, బుధవారం ఈ ధర రూ.240కి పెరిగింది. భీమవరం, నరసాపురం, గణపవరం తదితర ప్రాంతాల నుంచి ఏజెంట్లు రొయ్యల కోసం ముదినేపల్లి ప్రాంతంలో ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం 200 కౌంట్ స్థాయిలో రొయ్యలు ఉండడంతో అమ్మకాలు జరగడం లేదు. పట్టుబడులూ పెద్దగా లేవు. దీంతో ధరలు ఆక్వా రైతులకు గిట్టుబాటు కలిగించే విధంగా ఉన్నా రొయ్యల ఉత్పత్తి లేక ఫలితం లేకుండా పోయింది.

పాఠశాలల్లో ఎన్నికల సందడి

జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లల్లో గురువారం నుంచి ఎన్నికల సందడి నెలకొననుంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలను రద్దు చేస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి జీవో జారీ చేసింది. ఇదే క్రమంలో కొత్త కమిటీలకు ఈనెల 8న ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది.



- స్కూల్ కమిటీ ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా
- జిల్లాలో 1341 స్కూళ్లకు నేడు నోటిఫికేషన్
- 5న అభ్యంతరాలు.. 8న ఎన్నికలు

నరసాపురం రూరల్, జూలై 31: జిల్లాలోని 1341 స్కూళ్ళల్లో ఎన్నికలు నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధం అవుతున్నది. ఇటు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతో విద్యార్థుల తల్లితండ్రులు పోటీకి రెడీ అవుతున్నారు. పార్టీ ముఖ్య నేతల్ని కలిసి తమకు ఒకే చెప్పాలని ఒత్తిళ్ళు తీసుకొస్తున్నారు. దీంతో ఈసారి స్కూల్ ఎన్నికల్లో గట్టి పోటీ ఏర్పడే అవకాశం కనిపిస్తుంది. మరోవైపు విద్యాశాఖ అధికారులు అన్ని స్కూళ్ళకు బుధవారం ఎన్నికలకు సంబంధించిన వివరాలను అందజేశారు. ముందుగా ఎన్నికల కమిటీ ఎన్నికల్ని నిర్వహించాలని, ఆ తరువాత స్కూల్ ఛైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు పెట్టాలని, కమిటీ ఎన్నికల్లో ఎస్సీ, బీసీ, ఓసీలతో పాటు మహిళా కోటాను కూడా ఖచ్చితంగా చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం గురువారం ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్‌ను జారీ చేస్తారు. 5న అభ్యంతరాలు, 8వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు.

జిల్లాలో 1066 ప్రాథమిక స్కూళ్ళు, 81 మధ్యమిక, 209 హైస్కూళ్ళు ఉన్నాయి. అయితే ఇందులో 9 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్కూళ్ళకే ఎన్నికలు నిర్వహించనున్నారు. గురుకుల పాఠశాలలకు ఎన్నికలు జరగవు, ఈలెక్కన తొమ్మిది గురుకుల పాఠశాలలు మినహాయిస్తే మిగిలిన 1341 స్కూళ్ళకు ఎన్నికలు జరుగుతాయి. గత ప్రభుత్వం 2021లో ఎన్నికలు నిర్వహించింది. షెడ్యూల్ ప్రకారం రెండేళ్ళల్లో పదవికాలం ముగిసింది. అయినప్పటికీ తిరిగి ఎన్నికలు నిర్వహించకుండా ఇదే కమిటీలను కొనసాగిస్తూ వచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం వీటిని రద్దు చేసి, ఎన్నికలకు పచ్చజెండా ఊపింది.

ఎన్నికలు జరిగేది.. ఇలా....

ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రుల్ని ముందుగా కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాల్సి ఉంది. ఇందులో ఎస్సీ, బీసీ, ఓసీ రిజర్వేషన్‌తో పాటు ఖచ్చితంగా ఇద్దరు మహిళలకు ప్రాధాన్యత ఉండాలి. ఉదాహరణకు 5తరగతి వరకు ఉండే ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులకు 15 మంది కమిటీ సభ్యులు ఉంటారు. ఆదే ఏడోవ తరగతి వరకు ఉంటే 21, హైస్కూల్ స్థాయి అయితే ఆరు నుంచి పదోవ తరగతులు ఉంటాయి. అంటే ఐదు తరగతులకు 15 కమిటీ సభ్యుల్ని ముందుగా ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియకు ముందు తల్లితండ్రుల అందర్ని స్కూల్‌కు పిలించి వారి అభిప్రాయాలను సేకరిస్తారు. ఆ తరువాత 5న విద్యార్థుల తల్లితండ్రుల ఓటర్ల జాబితాను స్కూల్ బోర్డులో ఉంచుతారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని తొలగిస్తారు. ఆ తరువాత 8వ తేదీ ఉదయం ప్రతి తరగతి నుంచి ముగ్గుర్ని కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ మధ్యాహ్నానికి పూర్తి చేస్తారు. తిరిగి 2గంటల నుంచి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు జరుగుతాయి. వీరిద్దర్ని కూడా కమిటీ సభ్యులే ఎన్నుకోనున్నారు. అనంతరం వీరి చేత ప్రమాణస్వీకారం చేయిస్తారు. ఈప్రక్రియ అంతా స్కూల్ హెచ్‌ఎం నిర్వహించనున్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులు, ఛైర్మన్, వీసీ పదవిల కాలం రెండేళ్లు ఉంటుంది. స్కూల్ అభివృద్ధి, నిర్వహణ, విద్యా ప్రమాణాల పెంపు కమిటీనే నిర్వహిస్తుంది. నగదుకు సంబంధించిన లావాదేవిలన్ని ఛైర్మన్, హెచ్‌ఎం సంతకాలతో జరుగుతాయి.

ప్రతి స్కూల్‌కు ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు

ఛైర్మన్, వైస్ ఛైర్మన్ మిగిలిన కమిటీ సభ్యులతో పాటు ప్రతి స్కూల్‌కు ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉంటారు. వీరిలో స్కూల్ హెచ్‌ఎం, సీనియర్ ఉపాధ్యాయులు, వార్డు మెంబర్ లేదా కౌన్సిలర్, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, డ్వాక్రా సభ్యురాలు ఉంటారు.

శాంతించిన గోదావరి



కోడేరు వద్ద తగ్గిన గోదావరి

గోదావరి శాంతించింది. రెండు రోజుల నుంచే తగ్గుముఖం పట్టిన గోదావరి బుధవారం మరింతగా తగ్గింది. భద్రాచలం వద్ద బుధవారం ఉదయం ఏడు గంటలకు 44.8 అడుగులకు నీటిమట్టం నమోదైనప్పటికీ సాయంత్రానికి 45 అడుగులకు చేరి మళ్లీ 44.90 అడుగులకు తగ్గింది. మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది.

- జిల్లాలో బయటపడుతున్న పుష్కరఘాట్‌లు
- పొంగిపొర్లుతున్న డ్రెయిన్లు

పోలవరం/ఆచంట/యలమంచిలి/నరసాపురం, జూలై 31 : పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరిగి 23.257 మీటర్లకు చేరుకోగా 9,91,282 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. వరద జలాలను 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 14.30 మీటర్లు ఉంది. 10,40,000 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేయగా మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది. ఆచంట మండలం కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, భీమలాపురంలలో నీట మునిగిన పుష్కరఘాట్‌లో బయటపడుతున్నాయి. లంక గ్రామాల్లో అధికారులు శానిటేషన్ మెడికల్ క్యాంప్‌లు చేస్తున్నారు. అయితే లంకగ్రామాల్లో వేసిన పంట పొలాలు అన్ని దెబ్బ తిన్నాయని పంటలు దెబ్బ తిన్న రైతులను ఆదుకోవాలని లంక రైతులు కోరుతున్నారు. వరదనీరు తగ్గడంతో యలమంచిలి మండలం లంక గ్రామాల్లోని పలు ప్రాంతాలు బురదతో నిండివున్నాయి. కనకాయలంక కాజ్‌వేపై వరదనీరు ప్రవాహం కొనసాగుతుండటంతో స్థానికులు పడవల్లో రాకపోకలు కొనసాగిస్తున్నారు. నక్కల డ్రెయిన్, కాజ డ్రెయిన్‌లతోపాటు మీడియం, మైనర్ డ్రెయిన్‌లు పొంగి పొర్లుతున్నాయి. దీంతో వరిచేలు ముంపులోనే ఉన్నాయి. నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి ప్రాంతం బుధవారం వరద ముంపునకు గురైంది. పది రోజులుగా వరద కారణంగా ఏటిగట్టుకు సమీపంలో ఉంటున్న ఈ కాలనీలోకి నీరు చేరుతున్నది. అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల నుంచి గోదావరి నీరు డ్రెయిన్‌లలోకి రావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు అర్ధరాత్రి సమయంలో వర్షం పడడటంతో కాలనీలోని పలు నివాసాల్లోకి నీరు చేరింది. వీధుల్లో మోకాలు లోతు నీరు నిలిచింది. వరదకు భారీ వాన జత కావడంతో నీరు బయటకు పోయే మార్గం లేకపోయింది. మునిసిపల్ అధికారులు ఉదయం మోటార్లను ఏర్పాటు చేసి నీటిని బయటకు తోడుతున్నారు. ఛైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ వెంకటేశ్వరావు ముంపు ప్రాంతాన్ని సందర్శించారు. ఇటు వరద క్రమంగా తగ్గుముఖం పట్టింది. వలందర్‌రేవు, బుడితల రేవు, కొండాలమ్మ, లలితాంబ రేవుల్లో నీటి మట్టాలు తగ్గాయి. పిండాల రేవు, బాపు ఘాట్ బురదమయం అయ్యాయి. రేవుల్లో మెట్ల పరిస్థితి కూడా ఇలాగే కనిపించింది.



కాజ్‌వే వద్ద పడవపై కనకాయలంక వెళుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

లంక గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

యలమంచిలి: వరద ముంపునకు గురైన యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక గ్రామాల్లో కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం పర్యటించారు. ఆమె డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం చాకలిపాలెం రేవు నుంచి పడవపై ప్రయాణించి కనకాయలంక వెళ్లారు. గ్రామంలో వరద బాధితుల యోగక్షేమాలు అడిగి తెలుసు కున్నారు. బియ్యం, నిత్యావసర సరుకులు అందాయా.. పాడి రైతులకు పశువుల దాణా అందిందా అంటూ ఆరా తీశారు. లంక ప్రాంతంలో ద్విచక్రవాహనంపై ప్రయాణించి స్థానికంగా ఉన్న పరిస్థితులను, పంట నష్టంపై ఆరా తీశారు. తుఫాన్ షెల్టర్ వద్ద ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపును సందర్శించి గర్భిణులు, బాలింతల వివరాలను అడిగి తెలుసు కున్నారు. పాము, తేలు, కుక్కకాటుకు సంబంధించిన మందులు, వ్యాక్సీన్‌లు ఉన్నాయా అని అడిగారు.

పడకేసిన ప్రజారోగ్యం

- అధ్వానంగా పారిశుధ్యం
- డ్రెయిన్‌లలో సిల్ట్ కూడా తీయలేని పరిస్థితి
- సర్వేలతో ఆరోగ్య సిబ్బంది కాలక్షేపం



తాడేపల్లిగూడెం : డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 31: జిల్లాలో ప్రజారోగ్యం పడకేసింది. పెరుగుతున్న జ్వర పీడితులు సంఖ్యతో ఆరోగ్య సిబ్బందికి సవాల్ విసురుతోంది. దీనికి కారణం గ్రామాల్లో డ్రెయినేజీలు, పారిశుధ్య నిర్వహణకు నిధులు లేక పాలక సభ్యులు చేతులెత్తేయడంతో గ్రామాల్లో పరిస్థితి మరీ దయనీయంగా మారింది. జిల్లాలో రోజుకు 1500 మంది జ్వరపీడితులు నమోదవుతున్నారు. దీంతో గ్రామస్థాయిలో ఆరోగ్య సిబ్బంది గత వైసీపీ ప్రభుత్వంలో సర్వేలతో సరిపెట్టడంతో అదే పంథాను అవలంభిస్తూ ప్రజలను గాలికి వదిలేస్తున్నారు. జిల్లాలో అధికారికంగా తాజాగా డెంగీ కేసు పెనుగొండలో నమోదవడంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

క్షీణించిన పారిశుధ్యం..

గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల నిర్వహణకు నిధులు విధిలించకపోవడంతో పారిశుధ్య నిర్వహణ క్షీణించింది. గ్రామాల్లో డ్రెయినేజీల్లో సిల్ట్ తీసేందుకు కూడా నిధులు లేక రెండేళ్లుగా వదిలేసిన పరిస్థితి. దీంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తున్నాయి..

మూలపడిన సంపద సృష్టి కేంద్రాలు

గత టీడీపీ ప్రభుత్వంలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి, పొడిగా విడదీసి తడి చెత్త ద్వారా ఎరువు తయారు చేయడంతోపాటు పొడిచెత్తను విక్రయించి సంపద సృష్టించే కార్యక్రమాన్ని వైసీపీ నిర్వీర్యం చేసింది. సంపద సృష్టి కేంద్రాలు ఐదేళ్లుగా అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి.

పెరుగుతున్న జ్వర పీడితులు

జిల్లాలో జ్వరపీడితులు రోజురోజుకు పెరుగుతున్నారు. ఇప్పటి వరకూ రోజుకు 1200 నుంచి 1500 వరకూ ప్రభుత్వ లెక్కల ప్రకారం జ్వరపీడితులు నమోదు అవుతుండగా దీనికి మూడు రెట్ల జ్వరపీడితులు ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్‌ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నట్టు సమాచారం. ఇప్పుడిప్పుడే వర్షాలు తగ్గడంతో రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉండే పరిస్థితి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

పరిహాసం

- వాస్తవ బాధితులకు అందని పరిహారం
- అధికారులను నిలదీసిన బాధితులు

వేలేరుపాడు, జూలై 31: వేలేరుపాడు మండలంలోని వరద ముంపు గ్రామాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం రూ.3వేలు పంపిణీ కార్యక్రమం పరిహాసంగా మారింది. అధికారులు ఒక్కో గ్రామంలో ఒక్కోరీతిగా వ్యవహరిస్తూ అనుకూలమైన వారికి పరిహారాన్ని పంపిణీ చేస్తున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. గోదావరి వరద దరిదాపుల్లో కూడా రాని గ్రామాల్లో అందరికి పరిహారం చెల్లించి వాస్తవంగా వరద కారణంగా గృహాలు మునిగిపోయిన వారికి మొండిచెయ్యి చూపిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా మండల కేంద్రమైన వేలేరుపాడులో అధికారులు ఇష్టానురీతిగా వ్యవహరిస్తూ కొందరు పలుకుబడి కలిగినా వారు ఇచ్చిన లిస్టు ఆధారంగా పంపిణీ చేపట్టడంతో బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని సంత మార్కెట్ సెంటర్, రజక బజార్, ఎస్టీ కాలనీలకు సంబంధించి 83 కుటుంబాలకు రూ.3వేలు సహాయాన్ని అందించే కార్యక్రమం చేపట్టారు. అయితే అధికారులు రూపొందించిన జాబితాలోని కొందరి పేర్లు తీసేసి అనధికారికంగా కొందరు ఇచ్చిన జాబితా ప్రకారం పరిహారాన్ని పంపిణీ చేయడంతో బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి అధికారులను నిలదీయడంతో పంపిణీని నిలిపివేశారు. మరలా సర్వే చేసి పరిహారం పంపిణీ చేస్తామని డీటీ రమేష్ బాధితులకు తెలిపారు. అయితే ప్రభుత్వం రూపొందించిన 83 కుటుంబాలకు చెందిన జాబితాలో సంబంధంలేని 60 కుటుంబాలకు పరిహారం చెల్లించారు.

వరద సాయంలోనూ కక్కుర్తి

- బాధితులకు పంచాల్సిన ఉల్లిగడ్డలు, బంగాళ దుంపలు అక్రమ తరలింపు : అడ్డుకున్న నాయకులు



వ్యాన్‌లో తరలిస్తున్న బంగాళా దుంపలు, ఉల్లిగడ్డలు

వేలేరుపాడు: గోదావరి వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు అందించాల్సిన ఉల్లిగడ్డలు, బంగాళా దుంపలు అక్రమ మార్గం పట్టాయి. ఐదు రకాల కూరగాయలు కిలో చొప్పున ఒక్కొక్క బాధిత కుటుంబానికి ఐదు కిలోలు పంపిణీ చేయాల్సి ఉండగా అరకొర పంపిణీ చేసి మిగుల్చుకున్న నాలుగు టన్నుల ఉల్లిగడ్డలు, బంగాళా దుంపల బస్తాలను ఒక వ్యాన్‌లో తరలిస్తుండగా జనసేన నాయకులు ఆదినారాయణ, సుధాకర్, క్రాంతికుమార్, ములకలపల్లి నరసింహారావు తదితరులు సుమారు 15 కిలోమీటర్లు వెంబడించి మేడేపల్లి వద్ద అడ్డగించారు. వ్యాన్ డ్రైవర్‌ను వీటిని ఎక్కడికి తీసుకెళ్తున్నారని అడగ్గా చింతలపూడి తరలిస్తున్నట్టు తెలిపాడు. ఇంతలో సివిల్ సప్లై డీటీ అక్కడికి వచ్చి మేడేపల్లిలో పంపిణీ చేసేందుకు తెప్పించామని పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. ఇప్పటికే మేడేపల్లిలో కూరగాయల పంపిణీ పూర్తయ్యిందని, వ్యాన్‌డ్రైవర్ వాటిని చింతలపూడి తరలిస్తున్నామని చెబుతున్నాడని డీటీని నిలదీశారు. అనంతరం వ్యాన్‌ను వేలేరుపాడులోని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చి అధికారు లకు స్వాధీనం చేశారు. అక్రమ తరలింపుపై కేసు నమోదు చేసి వ్యాన్‌లో ఉన్న బంగాళా దుంపలు, ఉల్లిగడ్డలు స్వాధీనం చేసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఇవే కాకుండా బాధితులకు పంచాల్సిన నూనె ప్యాకెట్లు, కందిపప్పు ఇతర కూరగాయాలను కూడా సివిల్ సప్లై అధికారులు దొంగచాటుగా తరలించారని జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు. మండలానికి వచ్చిన సరుకులెంతా.. పంచింది ఎంత.. అనే లెక్కలు బయటపెట్టాలని జనసేన మండల అధ్యక్షుడు గణేషుల ఆదినారాయణ అధికారులను డిమాండ్ చేశారు.

ఇంకనూ..తొలగలేదేమి ?



ఆకివీడు నగర పంచాయతీ చైర్మన్ గదిలో మాజీ సీఎం జగన్ ఫొటో ఇంకా తొలగలేదు. ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటోలు తొలగించి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఫొటోలు పెట్టాలని ఆదేశాలు వచ్చాయి. అధికారులు అదేవిధంగా ఏర్పాటు చేశారు. కానీ నగర పంచాయతీ కార్యాలయ వైసీపీ చైర్మన్ జామీ హైమావతి గదిలో గోడకు ఉన్న జగన్ ఫొటో మాత్రం ఇంకా తొలగించలేదు. ప్రభుత్వానికి వైసీపీ నేతలు విలువ ఇవ్వడం లేదని కూటమి శ్రేణులు మండిపడుతున్నారు. - ఆకివీడు

మా భార్యలను కాపురాలకు పంపండి ?



ఇదో రివర్స్ సెంటిమెంట్.. కూతుళ్లను కాపురాలకు తీసుకు వెళ్లాలని మామ అల్లుళ్లను కోరడం చూశాం. కాని ఏలూరులో కూతుళ్లను కాపురానికి పంపించక పోవడంతో మామపై కోపంతో ఇద్దరు అల్లుళ్ల కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. వివరాల్లోకి వెళితే విజయవాడలో నివాసం ఉంటున్న శేషసాయి ఏలూరుకు చెందిన బూరగడ్డ శ్రీనివాస రామానుజ ఐయ్యంగార్ మొదటి కూతురును వివాహం చేసుకున్నాడు. ఉద్యోగరీత్యా గుజరాత్‌లో ఉంటున్న పవన్ ఐయ్యంగార్ రెండో కుమార్తెను ఇటీవల వివాహం చేసుకున్నాడు. అయితే తమ భార్యలను కాపురానికి పంపకుండా కూతుళ్లను ఇంటివద్దనే ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అల్లుళ్లిద్దరూ వాపోతున్నారు. కాపురానికి పంపమని పదేపదే బతిమిలాడుతున్నా తిరిగి తమపై వేధింపుల కేసులు పెట్టాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఐయ్యంగారికి ఉన్న పలుకుబడితో తమ భార్యలతో తమపైనా, కుటుంబ సభ్యులపైనా కేసులు పెట్టించి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తమ భార్యలను కాపురానికి పంపించాలని మామపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

-ఏలూరు రూరల్

పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు పూర్తిచెయ్యండి

పార్లమెంట్‌లో ఎంపీ మహేష్



రాష్ట్రంలో పెండింగులో ఉన్న రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంపీ మహేష్ పార్లమెంట్‌లో మాట్లాడుతూ బడ్జెట్‌లో రైల్వే మౌలిక సదుపాయాల కోసం రూ.9151 కోట్లు కేటాయించటం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. గత ఏడాది కేటాయించిన బడ్జెట్ కంటే 8.65 శాతం ఎక్కువని హర్షం వ్యక్తం చేశారు. వందేభారత్ రైళ్లను ఏలూరు స్టేషన్‌లో ఆపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కోటిపల్లి-నర్సాపూర్ రైల్వేలైన్, విజయవాడ- గూడూరు, గుడివాడ - నూజివీడు, భద్రాచలం - కొవ్వూరు రైల్వే మార్గాలను త్వరిత గతిన పూర్తిచేయాలని కోరారు. రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించి ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. ఏలూరు రైల్వేస్టేషన్‌ను అమృత్ స్టేషన్ల పథకంలో చేర్చడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధులు మహిళలు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

-ఏలూరు టూటౌన్

12 అడుగుల కొండచిలువ హతం



పోలవరం మండలం పట్టిసీమలో గ్రామస్థుల చేతిలో కొండచిలువ హతమైంది. ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి వరద జలాలలో కొట్టుకు వచ్చిన కొండచిలువ పట్టిసీమ రివర్ ఇన్ అతిథి గృహం ఆవరణలో సంచరిస్తుండడంతో భయ భ్రాంతులకు గురైన స్థానికులు కేకలు వేశారు. అక్కడ ఉన్న యువకులు దానిని కర్రలతో కొట్టి చంపారు. హతమైన కొండచిలువ 12 అడుగులు ఉందని తెలిపారు.

- పోలవరం

నిధుల్లేవ్.. విధుల్లేవ్..



వైసీపీ పాలనలో ఉత్సవ విగ్రహాలుగా ఎంపీటీసీలు
మూడేళ్లు గడుస్తున్నా చిల్లిగవ్వ రాలేదు..
టీడీపీతోనే న్యాయం అంటున్న ప్రజాప్రతినిధులు

ఏలూరు రూరల్, జూలై 31: గ్రామీణ ప్రజలకు ప్రజాసేవ చేయాలన్న కోరికతో పదవులు చేపట్టిన ప్రజా ప్రతినిధులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిరాశే మిగిలింది. ఎన్నికై మూడేళ్లు కావస్తున్నా తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకునేందుకు నిధులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కనీసం ప్రభుత్వ కార్యాలయాల్లో గౌరవమైనా దక్కుతుందా అనుకుంటే అది కూడా లేదు. 2021 ఏప్రిల్ 8న ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో జిల్లాలోని 1045 ఎంపీటీసీ స్థానాల్లో వైసీపీ కైవశం చేసుకుంది.

మూడేళ్లు గడిచినా ..

ఎంపీటీసీలుగా గెలిచి మూడేళ్లు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ హామీ నెరవేర్చలేదని ఎంపీటీసీలు లోలోపల మదన పడుతున్నారు. ప్రత్యేకంగా నిధులు లేవు.. విధులు లేవు. గ్రామ పంచాయతీలో కనీసం ఎంపీటీసీలకు ప్రత్యేకంగా కుర్చీలు కూడా లేకుండా పోయాయి. గ్రామాల్లో చిన్నచిన్న పనులు కూడా చేయలేని పరిస్థితి నెలకొనడంపై ఎంపీటీసీలు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పదవీకాలం ఇప్పటికే మూడేళ్లు గడిచిపోయింది. మండలపరిషత్‌కు గతంలో బీఆర్‌జీఎఫ్ తలసరి గ్రాంటు, ఆర్థికసంఘం నిధులు వచ్చేవి. దీంతో గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు అంతర్గత రోడ్లు చేపట్టేవారు. ప్రస్తుతం ఆ నిధులన్నీ ఎంపీటీసీల ప్రమేయం లేకుండా నేరుగా పంచాయతీలకు ఇవ్వడంతో వారికి గౌరవం కూడా లేకుండా పోయింది. 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి 20 శాతం ఎంపీ టీసీలకు ఇవ్వాల్సిందిగా కేంద్రం సూచించినా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదు. ఎంపీటీసీలకు నిధుల వాటా 25 శాతం పెంచాలన్న విజ్ఞప్తిని పట్టించుకోలేదు. ప్రత్యేక నిధులు కేటాయిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికి అది కార్యాచరణ దాల్చలేదు. ఎంపీటీసీ పదవి ఉన్నా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోతున్నామని ఎంపీటీసీలు వాపోతున్నారు.

నిధుల కోసం వినతులు

తమ హామీలను నిలబెట్టుకుని ప్రజల్లో గౌరవం పొందాలనుకున్న ఎంపీటీసీలకు అడుగడుగునా నిరాశ ఎదురైంది. నిధులు మంజూరు కోసం వినతులు ఇస్తున్నా స్పందన లేదు. వైసీపీ హయాంలో మండల పరిషత్‌కు పెద్దగా నిధులు మంజూరు కాలేదు. సాధారణ నిధులు కూడా అంతంత మాత్రంగా ఉండటంతో వారు ఏ పనీ చేయలేకపోయారు. గత ప్రభుత్వంలో ఎంపీటీసీలకు ఒక్క పైసా కూడా విదల్చలేదు

టీడీపీతోనే న్యాయం

స్థానిక సంస్థలను బలోపేతం చేసిన ఘనత టీడీపీదే. స్థానిక ప్రజా ప్రతినిధులకు అవసరమైన నిధులు కేటాయించిన ఘనత చంద్రబాబుదే. వైసీపీ ప్రభుత్వ హయాంలో గెలిచిన ప్రజాప్రతినిధులు అప్పుల పాలు అవ్వడంతో పాటు వారిచుట్టూ ఉన్న ప్రజలకు చెప్పుకోవడానికి ఒక్క పని కూడా చేసిన దాఖలాలు లేకుండా పోయాయి. తీవ్ర నిరాశకు గురైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి టీడీపీతోనే న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడానికి సిద్ధపడుతున్నారు.

- కడలి గోపాలరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు

ఏది నిజం..?

నరసాపురంలో సంచలనం రేకెత్తించిన తాకట్టు బంగారం కేసులో ఎన్నో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. ఉషారాణి తాకట్టు పెట్టింది..అసలైన బంగారమా.. ? లేదా నకిలీదా..? వ్యాపారి వాటిని మార్చాడా..? లేదా ఇంకా ఏమైనా కొత్త ట్విస్టులు ఉన్నాయా? ఈ కేసులో ఇలా అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి...

బంగారమే తాకట్టు పెట్టా : ఉషారాణి

కాదు.. నకిలీ బంగారం అంటున్న జైన్

మోసం చేశారంటూ పరస్పర కేసులు

అన్ని కోణాల్లో పోలీసులు విచారణ



నరసాపురంలోని తాకట్టు నగల దుకాణం

నరసాపురం, జూలై 31: నకిలీ బంగారం కేసు పోలీసులకు ఛాలెంజ్‌గా మారింది. ఇద్దరి ఫిర్యాదుల్ని స్వీకరించిన పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో రోజుకో ట్విస్ట్ వెలుగు చూస్తోంది. నకిలీ బంగారం తాకట్టు పెట్టి మోసం చేసిందని జేపీ బ్యాంకర్స్ అధినేత సుమేరామాల్ జైన్ ఆరోపిస్తుంటే తాను పెట్టింది అసలు బంగారమే అని వాటిని మార్చేసి తిరిగి చంపుతామని తమనే బెదిరిస్తున్నారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉషారాణి నెల్లూరులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాకట్టు వ్యాపారులు కస్టమర్లకు పెట్టిన వస్తువులకు రసీదులు ఇవ్వరన్న విషయం ఈ కేసుతో వెల్లడైంది. ఒక్క ఉషారాణి విషయంలో కాదు.. ఎవరూ పెట్టినా ఇదే పరిస్థితి. దీనివల్ల కస్టమర్లు కొన్ని సమయాల్లో మోసపోయే ప్రమాదం ఉంది. ఉషారాణి విషయంలో ఇదే జరిగింది. గడిచిన రెండేళ్లలో ఆమె దాదాపు 22 సార్లు వస్తువుల్ని తాకట్టు పెట్టింది. దీనికి ఎటువంటి రసీదు ఇవ్వలేదు. అయితే ఉషారాణి తాకట్టు పెట్టినప్పుడల్లా వస్తువుల బరువు చూసి తాకట్టు ఫారంలో ఆ వివరాలను నమోదు చేసి సంతకం కూడా పెట్టించారు. అయితే వస్తువుల్ని గీటు పెట్టకుండా అప్పు ఇవ్వడమే పెద్ద మిస్టరీగా మారింది. ఉషారాణి స్వస్థలం నరసాపురం అయి నప్పటికీ ఆమె కొంత కాలం నుంచి నెల్లూరులో ఉంటున్నారు.రాష్ట్రంలో నెల్లూరు బులియన్ వ్యాపారానికి పెట్టింది పేరు. అక్కడ తాకట్టు వ్యాపారాలు కూడా ఉన్నాయి. అక్కడ కాకుండా ప్రతిసారి నరసాపురంలోనే ఎందుకు తాకట్టు పెట్టారన్న సందేహం కూడా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఉషారాణి కుటుంబ నేపథ్యం.ఆమెకు ఈ బంగారం పూర్వీకుల నుంచి వచ్చిందా ? లేదా కొన్నదా.. ? ఇతర ఆస్తిపస్తులు, తాకట్టు పెట్టినప్పుడల్లా వచ్చిన డబ్బును ఏం చేశారు ? ఏమైనా ఆస్తులు కొన్నారా ? తదితర కోణాల్లో పోలీసులు లోతైన విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తును పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకున్నారు. దుకాణంలోని సీసీ కెమెరాల ఫుటేజ్, తాకట్టు పెట్టినట్లు వ్యాపారి చూపిస్తున్న వస్తువుల్ని కూడా పరిశీలించారు. అన్ని స్టేట్‌మెంట్‌లు, కేసుకు సంబంధించిన అన్ని ప్రూఫ్‌లను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ స్వామి చెప్పారు.

ఈపీడీసీఎల్‌లో పదోన్నతులు, బదిలీలు

విశాఖ సర్కిల్ ఎస్ఈగా జి.శ్యామ్‌బాబు
రాజమండ్రి ఎస్ఈగా గొర్లె ప్రసాద్

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో పలువురికి బుధవారం పదోన్నతులు కల్పించారు. మరికొందరిని బదిలీ చేశారు. ఈపీడీసీఎల్ పరిధి శ్రీకాకుళం జిల్లా నుంచి ఏలూరు వరకు ఉండడంతో అన్నింటిని దృష్టిలో ఉంచుకొని సీఎండీ పృథ్వీతేజ్ ఈ బదిలీలు చేశారు. విశాఖపట్నం కార్పొరేట్ ఆఫీసులో జీఎం (ఆపరేషన్స్-2)గా పనిచేస్తున్న జి.శ్యాంబాబును విశాఖ సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈగా నియమించారు. కాకినాడలో ఆపరేషన్స్ ఈఈగా పనిచేస్తున్న గొర్లె ప్రసాద్‌కు పదోన్నతి కల్పించి రాజమహేంద్రవరం ఆపరేషన్స్ ఎస్ఈగా నియమించారు. అక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న టీవీఎస్ఎన్ మూర్తికి పదోన్నతి కల్పించి కార్పొరేట్ కార్యాలయంలో ప్రాజెక్ట్ సీజీఎంగా వేశారు. విశాఖలో ప్రాజెక్ట్ జీఎంగా ఉన్న బి.అశోక్‌కుమార్‌కు సీజీఎంగా పదోన్నతి ఇచ్చి కార్పొరేటర్ కార్యాలయంలో వేశారు. పలాసలో ఆపరేషన్స్ ఈఈగా పనిచేస్తున్న గొప్పు ప్రసాద్‌కు పదోన్నతి కల్పించి విశాఖ కార్పొరేట్ ఆఫీసులో ఆపరేషన్స్ జీఎంగా నియమించారు. తాడేపల్లిగూడెంలో ఈఈగా పనిచేస్తున్న ఎ.రఘునాథబాబుకు పదోన్నతి ఇచ్చి కార్పొరేట్ ఆఫీసులో ప్రాజెక్ట్ జీఎంగా వేశారు. పార్వతీపురంలోని ఈఈ వెంకటేశ్వరరావును కార్పొరేట్ కార్యాలయంలో ఎనర్జీ ఆడిట్‌కు, కార్పొరేట్ కార్యాలయంలో ఈఈ సురేశ్‌కుమార్‌ను శ్రీకాకుళం టెక్నికల్ ఈఈగా, రాజమహేంద్రవరం ఈఈ ఉదయ భాస్కర్‌ను కాకినాడ ఆపరేషన్స్ ఈఈగా, శ్రీకాకుళంలోని ఈఈ ఎ.రాజశేఖర్‌ను రాజమహేంద్రవరం ఈఈగా బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో డిప్యూటీ ఈఈ బి.రఘుకు పదోన్నతి కల్పించి తాడేపల్లిగూడెం వేశారు. విజయనగరం డిప్యూటీ ఈఈ పి.మురళీకృష్ణకు పదోన్నతి కల్పించి కార్పొరేట్ కార్యాలయంలో పర్చేజెస్ ఈఈగా బదిలీ చేశారు. శ్రీకాకుళంలోని డిప్యూటీ ఈఈ పి.యోగీశ్వరరావుకు పదోన్నతి ఇచ్చి ఆపరేషన్స్ ఈఈగా పలాస బదిలీ చేశారు. సింహాచలం డిప్యూటీ ఈఈ కె.గోపాలరావునాయుడికి పదోన్నతి కల్పించి పార్వతీపురం ఆపరేషన్స్ ఈఈగా బదిలీ చేశారు. వీరు కాకుండా మరికొందరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు అసిస్టెంట్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించి బదిలీలు చేశారు.



ఉపాధ్యాయుడు శ్రీరామచంద్రమూర్తిని సత్కరిస్తున్న ఆంధ్రజ్యోతి తాడేపల్లిగూడెం బ్రాంచి మేనేజర్ హరిబాబు దంపతులు

గణిత ఉపాధ్యాయుడికి పదవీ విరమణ సత్కారం

ఉంగ్రాజవరం, జూలై 31: ఉపాధ్యాయ వృత్తి ద్వారా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చని ఎంఈవో సక్సేనరాజు అన్నారు. మోర్త హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మద్దిపాటి శ్రీరామచంద్రమూర్తి బుధవారం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. హైస్కూలులో జరిగిన అభినందన సభలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎంఈవో సక్సేనరాజు, ఆంధ్రజ్యోతి తాడేపల్లిగూడెం బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు దంపతులు శ్రీరామచంద్రమూర్తిని ఘనంగా సత్కరించారు. హెచ్ఎం కె.శ్రీనివాస్, హైస్కూలు ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి ఎస్.తాతారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు న్యాయం చేస్తాం

ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా



పోలవరం పోలీస్ స్టేషన్‌లో వివరాలు సేకరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

పోలవరం / కొయ్యలగూడెం జూలై 31 : దళారీల చేతిలో మోసపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. బుధవారం పోలవరం పోలీస్‌స్టేషన్‌లో గత రబీ సీజన్‌లో మొక్కజొన్న, ధాన్యం మధ్యవర్తి ద్వారా విక్రయించామని సొమ్ములు అందక మోసపోయమని రైతులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణకు వచ్చిన జిల్లా వ్యవసాయాధికారి ఎస్ఐ పవన్ కుమార్‌ని, మధ్యవర్తి పన్నూరి సూరిబాబుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్న తాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. మధ్యవర్తి ద్వారా 103 మంది రైతులకు ధాన్యం సొమ్ములు 79 లక్షలు, 33 మంది రైతులకు మొక్కజొన్న సొమ్ములు కోటి 23 లక్షల రూపాయలు ఇవ్వాల్సి ఉందన్నారు.ఇదేవిషయమై కొయ్యలగూడెంలో ధర్నా చేస్తున్న రైతులను కలిసి వివరాలు సేకరించామన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు బుజ్జిబాబు, వ్యవసాయాధికారి కె.రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

పంట సొమ్ములు ఇప్పించండి...



నరసింహారావు ,ప్రభాకర్

పంటసొమ్ములు ఇప్పించాలని బుధవారం పోలీసులను వ్యవసాయశాఖ అధి కారులను రైతులు కోరారు. సుమారు 2.50 లక్షల విలువైన మొక్కజొన్న పంట 120 క్వింటాళ్ళు మధ్యవర్తి ద్వారా దళారికి ఇచ్చామని ఇప్పటి వరకూ పంట సొమ్ములు రాక ఇబ్బందులకు గుర వుతున్నామని రైతు పన్నూరి నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు 7 లక్షల రూపాయల విలువ గల 4 వందల క్వింటాళ్ళ మొక్కజొన్న పంటను దళారులను నమ్మి ఇచ్చి మోసపోయినట్టు రైతు కరిబండి ప్రభాకర్ వాపోయాడు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా వెంటనే కొనుగోలు చేస్తే ఈ అవస్థలు ఉండేవి కావని ఆవేదన వ్యక్తం చేశాడు.

మోసగించిన దళారులను శిక్షించాలి

కొయ్యలగూడెం : రైతులను మోసం చేసిన దళారులను శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే ముడియం శ్రీనివాస్ అన్నారు. బుధవారం కొయ్యలగూడెం గొడౌన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు. దళారుల చేతిలో మోసపోయిన రైతులను రైతులకు న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతులకు అండగా నిలిచారు. సీపీఎం కార్యదర్శి రాంబాబు ఆందోళనకు మద్దతు తెలిపారు.

నరసాపురం లేసు పార్కులో ఎన్నికల కోలాహలం

ప్రస్తుత పాలకమండలి రద్దు చేస్తూ ఉత్తర్వులు
పార్క్ పరిధిలోని 51 సొసైటీలకు ఎన్నికలు



నరసాపురం రూరల్, జూలై 31: నరసాపురం లేసు పార్కు సొసైటీ ఎన్నికలకు నగారా మోగింది. ప్రస్తుత పాలక మండలిని రద్దు చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 23న ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. లేసు పార్కు పాలక మండలితో పాటు పరిధిలోని 51 సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలక మండలిని ఎన్నుకోవాలని ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో లేసు పార్కులో ఎన్నికల కోలాహలం నెలకొంది. నరసాపురం లేసు పార్కు పరిధిలో నర సాపురం, మొగల్తూరు, యలమంచిలి, పోడూరు, పాలకొల్లు, వీరవాసరం మండ లాలు ఉన్నాయి. ఈ ఆరు మండలాల్లో 51 సొసైటీలు ఉండగా పది వేల మంది సభ్యులు ఉన్నారు. లేస్ పార్కు బైలా ప్రకారం ముందుగా 51 సొసైటీలకు ఎన్ని కలు నిర్వహిస్తారు. ఎన్నికైన 51 మందితో తిరిగి తొమ్మిది మందిని లేసు పార్కు సొసైటీ పాలకమండలి సభ్యులుగా ఎన్నుకుంటారు. వీరిలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కోశాధికారి, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఉంటారు. ఈనెల 23న 51 సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి మధ్యాహ్నం లేసుపార్కు పాలక మండలి సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ విషయాన్ని పార్కు పరిధిలోని అన్ని సైటీల్లోని సభ్యులకు తెలి యజేసినట్టు లేసు పార్కు ప్రాజెక్టు మేనేజర్ కుసుమకుమారి తెలిపారు.

కల్తీ పెట్రోలు, డీజిల్ విక్రయాలు..కేసు నమోదు

భీమడోలు, జూలై 31 : అనుమతులు లేకుండా డీజిల్, పెట్రోల్ అమ్ముతూ అందులో సాల్వెంట్ ఆయిల్ కలిపి కల్తీ చేసి అమ్మకాలు కొనసాగిస్తున్న బృందాన్ని అరెస్టు చేసినట్లు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. కాకినాడ జిల్లా శంకవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన తోట తాతబ్బాయిరాజు, తోట చంటిబాబు, దూడల వెంకటరమణ, శ్రీరాములు అనే వ్యక్తులు గత కొంతకాలంగా ఎటువంటి డీజిల్, పెట్రోల్‌ను కల్తీ చేసి విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు బుధవారం కురెళ్ళగూడెం హైవేలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 210 లీటర్ల కల్తీ ఆయిల్‌ను, ఆటోను స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చొరబడిన దొంగలు

భీమవరం క్రైం, జూలై 31 : తాళం వేసి ఊరు వెళ్లిన ఒక ఒక ఇంట్లో దొంగలు చొరబడ్డారు. భీమవరం హౌసింగ్ బోర్డులో నివాసం ఉండే నాచు శేషగిరిరావు కుటుంబం గతనెల 8వ తేదీన బెంగుళూరులో ఆసుపత్రికి వెళ్లారు. అయితే రోజూ పని మనిషి వచ్చి ఇంటి బయట శుభ్రం చేసి వెళ్తుంది. రోజులాగానే బుధవారం కూడా వచ్చేసరికి ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో శేషగిరిరావు బంధువు నల్లం లోకనాథరావుకి తెలియజేసింది. ఆయన వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ దేవరాజు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాలు.. ఆరుగురి మృతి

దమ్ము ట్రాక్టర్ తిరగబడి ఒకరి మృతి



టి.నరసాపురం, జూలై 31: పొలంలో దమ్ము చేస్తుండగా అదుపుతప్పి ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. టి.నరసాపురం మండలం బండివారిగూడెం గ్రామానికి చెందిన పోకల సుబ్బారావు (56) గంగినీడు పాలెంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో దమ్ము చేస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. సుబ్బారావు ట్రాక్టర్ కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు.అతనిని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు తెలిపారు.

ధర్మాజీగూడెంలో చెరువులో పడి ఒకరు..

లింగపాలెం : లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన నక్కా దుర్గారావు (23) బుధవారం తెల్లవారుజామున ధర్మాజీగూడెంలోని చెరువుకు బహిర్భూమికి అని వెళ్ళి ప్రమాదవశాస్తు కాలుజారి చెరువులో పడి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం అటుగా వెళుతున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు తెలియచేయడంతో వారు వెళ్ళి చూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

ఇంట్లో ఇస్త్రీ చేస్తుండగా షాక్ కొట్టి ప్రైవేటు ఉద్యోగి..



దెందులూరు : ఏలూరులో ఒక ప్రైవేటు కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దోసపాడు గ్రామానికి చెందిన జంగం తంబి (26) తన ఇంట్లో బట్టలను ఇస్త్రీ చేసుకుంటున్న సమయంలో షాక్ కొట్టడంతో స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఏలూరు ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు తంబి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచారు

విద్యుదాఘాతంతో అన్నమయ్య జిల్లాలో వ్యాపారి దుర్మరణం..



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పదిలం శీను..

ప్రమాదానికి గురైన ఐషర్ వాహనం



వాల్మీకిపురం, జూలై 31: విద్యుత్ షాక్‌కు గురై పెదవేగి మండలం చక్రాయగూడేనికి చెందిన వ్యాపారి పదిలం శీను (41) అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శీను వ్యాపారం నిమిత్తం ఏలూరు నుంచి చాక్లెట్ తయారీ సామగ్రిని ఐషర్ లారీలో తమిళనాడులోని దారాపూర్‌కు తీసు కెళ్లాడు. అక్కడ సామగ్రి దించి తిరిగి అదే లారీలో బయలుదేరాడు. లారీ డ్రైవర్ రెడ్డప్ప అత్తగారి ఊరు వాల్మీకిపురం. అత్తగారి ఇంటికి వెళ్లేందుకు బుధవారం తెల్లవారుజామున లారీని స్థానిక బైపాస్ రోడ్డులో ఓ పక్కగా ఆపి వెళ్లాడు. లారీ ఇళ్లకు అడ్డంగా ఉందని స్థానికులు చెప్పారు. డ్రైవర్ రెడ్డెప్ప ఎంతకూ రాకపోవడంతో లారీలోనే ఉన్న పదిలం శ్రీను ఉదయం 6 గంటలకు లారీని అక్కడ నుంచి తీసి రోడ్డు పక్కన ఆపి లారీ నుంచి కిందికి దిగగానే అప్పటికే లారీ పైభాగాన్ని విద్యుత్ తీగలు తాకి ఉండడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ పులి శేఖర్, ఎస్ఐ నాగేశ్వర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ప్రమాదంపై విచారణ చేపట్టారు. శీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా బైపాస్ రోడ్డులో విద్యుత్ మెయిన్ లైన్ తీగలు కిందికి వేలాడడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. లారీ డ్రైవర్ రెడ్డప్పను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగి..

భీమడోలు : భీమడోలు మండలం పూళ్ళ గ్రామానికి చెందిన గుంట త్రిమూర్తులు (30) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పురుగు మందు తాగి మృతి చెందినట్టు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.పూళ్ళ గ్రామానికి చెందిన గుంట త్రిమూర్తులు సుమారు ఐదు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంత కాలంగా అప్పులతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో 29వ తేదీ రాత్రి పూళ్ళ శివారు నాగేశ్వరరావు పేట భవానీ అమ్మవారి గుడి సమీపంలోని పొలాల్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించగా 30వ తేదీ మధ్యాహ్నం మృతి చెందాడు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యం తట్టుకోలేక పురుగుమందు తాగి ఒకరు..

లింగపాలెం : లింగపాలెం మండలం బోగోలు గ్రామానికి చెందిన దాసరి వెంకట నారాయణ (42) అనారోగ్య కారణాలతో పురుగుమందు తాగి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి పురుగుమందు తాగి స్పృహ కోల్పోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విజయవాడలోని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

పాతూరికి సీఎం చంద్రబాబును కలిసే అవకాశం

పెంటపాడు, జూలై 31: మౌంజీపాడుకు చెందిన తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరికి అరుదైన అవకాశం దక్కింది. సార్వత్రిక ఎన్నికల్లో సోషల్ మీడియాలో టీడీపీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్ ద్వారా పార్టీ ప్రచారం చేయడంలో పది లక్షల పాయింట్లు సాధించిన వారికి సీఎం చంద్రబాబునాయుడుని కలిసే అవకాశం పార్టీ కల్పించింది. రాష్ట్రంలో మొత్తం 8 మంది ఇందుకు అర్హత సాధించగా వారిలో 16,80,770 పాయింట్లు సాధించి పాతూరి మొదటి స్థానంలో నిలిచారు

నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలి

భీమవరం అర్బన్, జూలై 31:పార్టీ ఆదేశించిన అన్ని కార్యక్రమాలలో సుమారు 300 మంది నియోజకవర్గ నాయకులు అకుంఠిత దీక్షతో పాల్గొన్నారని వారికి నామినేటెడ్ పదవులలో సముచిత స్థానం కల్పించాలని పట్టణ మండల అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, రేవు వెంకన్న కోరారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో వినతుల స్వీకరణ ఇన్‌చార్జిలుగా ఉన్న రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మిలకు బుధవారం నాయకులు వినతి పత్రాలు అందించారు. నాయకులు గూడూరి సుబ్బరావు, వీరవల్లి శ్రీనివాస్, కౌరు వృద్ధీశంకర్, ఉప్పులూరి చంద్రశేఖర్, గంగాధర్ తిలక్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి అడ్డుపడితే సహించం : బొలిశెట్టి


ట్రాక్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు, జూలై 31: ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, గ్రామాభివృద్ధికి ఏ సర్పంచ్ అయినా అడ్డుపడితే సహించేది లేదని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి హైమవతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు తమ గ్రామాల్లోని పారిశుధ్యం, తాగునీరు, డ్రెయినే జీ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు సొంతపనులు చేయించుకుని బిల్లులు పెడితే చట్టపరంగా విచారణ చేస్తామని, గ్రామాలకు సహకరించని సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేయాలని ఎంపీడీవో బాలాజీ వెంకటరమణను ఆదేశించారు. జడ్పీటీసీ ఉప్పులూరి వరలక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏవో పార్థసారథి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెంటపాడు పంచాయతీకి ట్రాక్టర్ అందజేత

పెంటపాడు పంచాయతీకి రూ.4.50 లక్షలతో దాతలు అందజేసిన ట్రాక్టర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. పెంటపాడును అన్ని గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, నల్లమిల్లి చినగోపిరెడ్డి, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.3.19 లక్షలు

ఆకివీడు, జూలై 31 : పట్టణ పరిధిలోని నాలుగు దేవస్థానాల్లో హుండీలు ఆదాయం రూ. 3,19,911 వచ్చిందని దేవాలయా ఈవో ఏవీ సత్యనారాయణరాజు తెలిపారు. బుధవారం స్థానిక పెద్దింట్లమ్మ దేవస్థానంలో రూ. 1,79,167, మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో రూ.67,538, రుక్మిణీ సమేత మదన గోపాలస్వామి దేవస్థానంలో రూ.13,355, వనువులమ్మ దేవస్థానంలో రూ.59,851 ఆదా యం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆయా దేవస్థానాల చైర్మన్లు, అర్చకులు ఉన్నారు.

యాభై రోజులు పూర్తిచేసుకున్న అన్న క్యాంటీన్

ఆకివీడు, జూలై 31 : దాత గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు సహకారంతో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్ బుధవారానికి యాభై రోజులు పూర్తి చేసుకుంది. ప్రభుత్వం అధికారకంగా ఏర్పాటు చేసే వరకు దాత టీడీపీ సీనియర్ నేత గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు తన తండ్రి సుబ్బరాజు పేరుమీద స్థానిక దొరగారి చెరువు దగ్గర అన్నక్యాంటీన్ ఏర్పాటు చేశారు. టీడీపీ మండల-పట్టణ కార్యదర్శులు నౌకట్ల రామారావు, గంధం ఉమా, ఎండీ అజ్మల్, మోపిదేవి శ్రీను, వేగేశ్న రామరాజు ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 31: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని సీడబ్ల్యూసీ గోదాం అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్ కుమార్ కోరారు. తాడేపల్లిగూడెం సీడబ్ల్యూసీ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో నల్లజర్ల రోడ్డులో ప్రహరీ పొడవునా మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ కార్యక్రమం చేపట్టిన యూనియన్‌ను అభినందించారు. సూపరింటెండెంట్ శివ సాయికుమార్, ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, గోదాం లేబర్ యూనియన్ నాయకుడు గోకా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాలాజి

నరసాపురం,జూలై 31; హోరాహోరీగా సాగిన నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా చేగొండి బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా రంపా పుల్లాజీ ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో గ్రంథాలయ కార్యదర్శిగా నార్ని శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక వ్యవహారాల కార్యదర్శిగా మేడిద శ్రీమంత్, మహిళా ప్రతినిధిగా బొడ్డు ప్రగతి ఎన్నికయ్యారు. ఇప్పటికే సంఘం ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి రమేష్, కోశాధికారిగా పి.శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కురెళ్ల సోమ శేఖర్, మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం పోలింగ్‌లో 177 ఓట్లకు గాను 167 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది నల్లిమిల్లి జోసఫ్ వ్యవహరించారు.

కేరళలో బాధితులకు సహకారం అందించండి

భీమవరంటౌన్, జూలై 31 : కేరళ రాష్ట్రంలో కొండ చెరియలు కూలిన ప్రమాద బాధితులకు మానవత్వంతో ప్రతి ఒక్కరూ సాయం చేయాలని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, చిరు పవన్ తేజం సేవా సమితి అధ్యక్షుడు ఉండపల్లి రమేష్‌నాయుడు, యూత్ హాస్టల్స్ జిల్లా కార్యదర్శి మాట్లపూడి సత్యనారాయణ, నరహరిశెట్టి కృష్ణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కొండ్రు శ్రీనివాస్, పులపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ విపత్తుగా భావించి సహకారం అందిద్దామని పిలుపునిచ్చారు. భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబు సహకారంతో రక్త దాతలను సమీకరించి కేరళకు పంపించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.

నేడు జాబ్ మేళా

తణుకు, జూలై 31: చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాలలో ఆగస్టు 1న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్, ఎవన్ ఎంటర్‌ప్రైజస్ సంస్థలు క్యాంపస్ ఇంటర్వ్యూలు గురువారం కాలేజీలో 9. గంటలకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 2021-24 సంవత్సరాల్లో డిగ్రీ పాసైన వారు అర్హులన్నారు. ఏడాదికి లక్ష నుంచి 2.40 లక్షల వరకు జీతం ఉంటుందన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **పాలకోడేరు, జూలై 31:** గొల్లలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధి పనులకు, డ్రెయినేజీ పనులకు బుధవారం సర్పంచ్ కె.లక్ష్మి, మాజీ సర్పంచ్ గాదిరాజు సూర్యనారాయణరాజు, టీడీపీ నాయకుడు కామన రాంబాబు, కృష్ణ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు.
- అత్తిలి : అత్తిలి శివారు సంతాన గోపాలస్వామి ఆలయ ప్రాంతంలో కలుషిత తాగునీరు సరఫరా కావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని సత్యం సేవా సమితి అధ్యక్షుడు దిరిశాల మునేశ్వరరావు తదితరులు కోరారు.
- నరసాపురం రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీ వో వీరభద్రరావు తెలిపారు. రేవు పాట ప్రారంభ ధరపై నిర్ణయం తీసుకుని నోటిఫికేషన్ ఇస్తామన్నారు.
- మొగల్తూరు : తల్లిపాల వారోత్సవాలు గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో బి.ఊర్మిళ తెలిపారు.
- తణుకు : ప్రతి ఒక్కరూ ఆడపిల్లలను చదివించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల తణుకు అర్బన్ సెక్టార్‌లోని పైడిపర్రు జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం ఏడుకొండలు తెలిపారు.
- ఆకివీడు : తాళ్ళకోడులోని జగనన్న కాలనీని నగర పంచాయతీకి అనుసంధానం చేసి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సీపీఎం నేతలు ఎమ్మెల్యే రఘురామకు బుధవారం వినతిపత్రం అందించారు.
- కాళ్ల(ఉండి): ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించడమే కాళ్ల మండలం ఎస్‌సీ బోస్ కాలనీలో మంచినీటి అభివృద్ధి పనుల భూమిపూజ కార్యక్రమంలో సర్పంచ్ మంతెన శ్రీనివాసరాజు అన్నారు.

ప్రతి శాఖలో అప్పులే.. ఆదాయ వనరులు లేవు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు


మాట్లాడుతున్న మంతెన రామరాజు

భీమవరం అర్బన్, జూలై 31 : 'ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే సమయానికి ఖజానాలో పైసా లేదు.. ప్రతి శాఖలో అప్పులే తప్ప.. ఆదాయ వనరులు లేవు' అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అన్నారు. బుధవారం భీమవరం జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే కీలకమైన ఐదు హామీలపై సంతకాలు చేసి రైతులు, నిరుద్యోగులు, పేదలు, యువతకు లబ్ధి చేకూర్చారన్నారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' అనే కీలక నిర్ణయంతో చంద్రన్న ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి.. పట్టాలు మాత్రమే ఇస్తాం ఇళ్లు మీరే కట్టుకోవాలని మాట తప్పిందన్నారు. పేదల కోసం చంద్రబాబు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లేని వారికి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లు అందిస్తారన్నారు. సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని వారికి రూ.4లక్షల అందజేస్తుందని తెలిపారు. జర్నలిస్టులకు ఎన్డీఏ ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ధ్యేయంగా పాటుపడదాం

» ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

ఆకివీడు, జూలై 31 : రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా పట్టణాభివృద్ధికి అందరం కలసి పాటుపడదామని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. టీడీపీ, జనసేన కౌన్సిలర్లు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రతిపక్ష నేతలను అవమానించడం తప్ప పట్టణం ఒక శాతం కూడా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రైల్వే డబుల్ లైన్ చేసిన దగ్గర నుంచి గూడ్స్ రైళ్లు ఎక్కువగా వెళ్లడంతో తరచూ గేట్లు పడి విద్యార్థులు, వర్తకులు, రైస్ మిల్లర్స్ తదితరులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇరవై వార్డుల్లో తాగునీరు, డ్రెయినేజీ, డంపింగ్ యార్డు, దోమల సమస్యలు, కుక్కల బెడద, ట్రాఫిక్ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ పరిమెళ్ల లాకుల నుంచి ఏలూరుపాడు వరకు గతంలో ఏర్పాటు చేసి రూ.30 కోట్ల పైపులైన్ సగంలోనే ఆగిపోయిందని, దానిని పునరుద్ధరిస్తామన్నారు. అనధికార డంపింగ్ యార్డులను పూర్తిగా తొలగించి శాశ్వత స్థలం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం తనను గతంలో నియోజకవర్గానికి రాకుండా చేసిందని, ప్రస్తుతం అందరం సహకరించుకుంటూ అభివృద్ధి చేసుకుంటూ న్యాయంగా వ్యవహరిద్దామన్నారు. కార్యక్రమంలో చైర్మన్ జామి హైమావతి, కమిషనర్ కృష్ణమోహన్, మేనేజర్ వెంకటేశ్వరరావు, టీపీవో తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు సందర్శించి మాట్లాడారు. సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలు పరిష్కారానికి వైద్య బృందం సహకరించాలన్నారు. ఇటీవల తాను ఆసుపత్రిని పరిశీలించినప్పుడు డ్రెయినేజీ తదితర సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారని, దాని కోసం ఎక్స్‌కవేటర్ పంపిస్తే కొన్ని పనులు చేసిన తరువాత వెనక్కి పంపించడం మంచిది కాదన్నారు. డయాలసిస్, విద్యుత్, లెట్రిన్ ట్యాంకులు సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయన్నారు.


కేశవరం బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు రఘురామ, ధర్మరాజు

బ్రెయిలీ బ్రిడ్జికి మరమ్మతులు చేయిస్తాం..

గణపవరం:శిథిలావస్థలో ఉన్న కేశవరం బ్రెయిలీ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఉండి, ఉంగుటూరు ఎమ్మెల్యేలు కనుమూరి రఘురామకృష్ణరాజు, పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. బుధవారం కేశవరం వద్ద ఉండి పంట కాల్వపై ప్రమాదభరితంగా ఉన్న బ్రిడ్జిని వారు పరిశీలించారు. బ్రిటీష్ హయాంలో నిర్మించిన వంతెన కూలిపోయి 14 ఏళ్లు అయ్యిందని దీనిస్థానంలో నిర్మించిన బ్రెయిలీ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని స్థానికులు తెలిపారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్ళి సత్వరమే మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యేలు తెలిపారు. పొత్తూరి కృష్ణంరాజు, చింతలపాటి బాబు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేడు పెన్షన్ల పంపిణీ మహోత్సవం : ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జూలై 31: పెన్షన్ల పంపిణీని ఒక ఉత్సవంలా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం జరిగే కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు విచ్చేస్తా రన్నారు. తణుకు నియోజకవర్గంలోని వరిఘేడు, ఎర్రనీలిగుంట, తణుకు పట్టణం, ఇరగవరం గ్రామాల్లో పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గంలో 36 వేల 678 మంది పెన్షన్‌దారులకు రూ.15,46,11,500 నగదును పంపిణీ చేస్తామన్నారు.

సినీ నటుడు అల్లు రామలింగయ్యకు ఘన నివాళి


అల్లు రామలింగయ్య విగ్రహం వద్ద అభిమానుల నివాళి

పాలకొల్లు అర్బన్, జూలై 31 : పాలకొల్లు తొలి తరం సినీ నటుడు పద్మశ్రీ అల్లు రామలింగయ్య వర్థంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని టాక్సీ స్టాండ్ వద్ద గల రామలింగయ్య విగ్రహానికి అభిమానులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ చిరు పవన్ యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ హాస్యనటుడిగా పద్మశ్రీ పురస్కారం పొందడంతో పాటు హోమియోపతి వైద్యుడిగా, స్వాతంత్ర్య సమర యోధుడిగా చరిత్రలో నిలిచి ఉంటారని తెలిపారు. శిడగం సురేంద్ర, బి. లక్ష్మీనారాయణ, మద్దాల గణేష్, ముచ్చర్ల రమేష్, తిరుమలరెడ్డి రామకృష్ణ, చేబ్రోలు కృష్ణమోహన్, తోలేటి శ్రీను, నూకల శ్రీను, అలుగు సత్తిబాబు తదితరులు ఉన్నారు.

పదవీ విరమణ పోలీస్ సిబ్బందికి సత్కారం

భీమవరం క్రైం, జూలై 31 : పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి వారి కుటుంబానికి పోలీస్‌శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ నయీం అస్మి అన్నారు. బుధవారం సుదీర్ఘకాలం పాటు పోలీస్‌శాఖకు విశేష సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఎస్ఐ డి.సంజీవరావు, సీనియర్ అసిస్టెంట్ జె.పద్మావతిలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ శాలువాతో సత్కరించి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ పొందినప్పటికీ జిల్లా పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందన్నారు. ఆర్మ్ రిజర్వ్ డీఎస్పీ ఎం. సత్యనారాయణ, ఏవో రామ్‌కుమార్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోజెష్ తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలను ప్రజలకు అందిద్దాం'


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హరిబాబు

ఉండి జూలై 31: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేద్దామని, ఎమ్మెల్యే రఘురామ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు అభినందనీయమని ఎంపీపీ ఇందుకూరి హరినారాయణరాజు అన్నారు. బుధవారం ఉండి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ హరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన గృహ పథకాన్ని అమల్లోకి తెస్తుందని, గృహనిర్మాణానికి రూ.4లక్షలు అందించే విషయాన్ని ప్రజలందరికీ తెలియజేద్దా మన్నారు. కలిగొట్ల టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు రుద్రరాజు యువరాజు మాట్లాడుతూ రైతులను దృష్టిలో పెట్టుకుని డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, వరదలు రాకమునుపే పంట కాల్వల అభివృద్ధి చేయిస్తున్న ఎమ్మెల్యే రఘురామకు సమావేశం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. చెరుకువాడ సర్పంచ్ కొండవీటి సాంబశివరావు, పాములపర్రు సర్పంచ్ కేశన శాంతికుమారి, ఈవోపీఆర్‌డీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని సూచించారు. వైస్ ఎంపీపీలు దత్తాల సుజాతరాణి, గుత్తుల కనకమహాలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ దాట్ల సేవలు మరువలేనివి

పెనుమంట్ర, జూలై 31 : సీపీఎం, కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎస్ఆర్ దాట్ల 45 వర్థంతి పెనుమంట్ర స్తూపం వద్ద నిర్వహించారు తొలుత బ్రాహ్మణ చెరువు నుంచి పెనుమంట్ర స్తూపం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఎస్ఆర్ దాట్ల స్తూపం వద్ద ఉన్న జెండాను కల్లు గీతా కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహ మూర్తి జెండా ఆవిష్కరించారు. స్తూపంపై ఉన్న ఎస్ఆర్ దాట్ల చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, కె.గోపాలన్ పూల దండ వేసి నివాళులర్పించారు, సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం, జుత్తుగ నరసింహమూర్తి మాట్లాడుతూ జిల్లాలో గుర్తుండే ప్రముఖ వ్యక్తులలో ఎస్ఆర్ దాట్ల అని కొనియాడారు. గీత కార్మిక సంఘం నాయకులు భూషణం బాలాజీ, కె.నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు చింతపల్లి శ్రీరాములు కృష్ణంరాజు ఉప్పురంగారావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ

పెంటపాడు, జూలై 31: వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసిందని గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయని ఉండి, ఉంగుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యేలు రఘురామకృష్ణరాజు, పత్సమట్ల ధర్మరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు పరిమెళ్లలో లాకులను పరిశీలించి మాట్లాడుతూ సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా ఉంగుటూరు నుంచి ఉండి నియోజకవర్గం వరకూ మంచినీటిని అందించే పైప్‌లైన్ ప్రాజెక్టు గతంలో మంజూరు కాగా పనులను మధ్యలోనే వైసీపీ ప్రభుత్వం ఆపివేసిందన్నారు. పైపులైన్ల మరమ్మతుల కోసం మంజూరైన రూ.61లక్షలతో పనులు చేయించాలన్నారు.

భీమవరంలో విద్యార్థుల ర్యాలీ

భీమవరంటౌన్, జూలై 31 : భీమవరంటౌన్, జూలై 31 : ఒలిపింక్ క్రీడల్లో మన భారత క్రీడాకారులు పతకాలు సాధించడంతో పట్టణంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులతో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం ర్యాలీని ప్రారంభించిన రెండో పట్టణ సీఐ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో మను భాకర్ దేశం తరపున మొదటి బోణీ కొట్టడం గొప్పవిజయమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ మాట్లాడుతూ మిగిలిన విభాగాల్లో అనేక విజయాలు సాధించాలన్నారు. అనంతరం నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అభిరుచి హోటల్ నుంచి బొంబే స్వీట్స్‌సెంటర్ లోని గాంధీజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. నరహరిశెట్టి కృష్ణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సతీష్, ఏవో సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అష్టమ పీఠాధిపతి మొహిద్దీన్ బాషా వర్ధంతి

అత్తిలి, జూలై 31 : అత్తిలి విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో పీఠం అష్టమ పీఠాధిపతి మొహిద్దీన్ బాషా 35వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పీఠాధిపతిగా సేవా కార్యక్రమాలతో ఆదర్శ ప్రాయులయ్యారని పీఠం ప్రతినిధి పాటియా అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా విభిన్న రంగాల్లో సేవలం దిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా వెలగల సుదర్శన్ రెడ్డి, మాధవి దంపతులు తమ కుమారులు సాయికాంతరెడ్డి, కృష్ణకాంతరెడ్డి జ్ఞాపకార్థం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పీఠం సభ్యుడు నందం తాతయ్య మనవరాలు నమశ్రీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పీఠం ప్రతినిధి బొండేపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'సొసైటీకి ఉపయోగపడే పరిశ్రమలు స్థాపించాలి'

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 31:సొసైటీకి ఉపయోగపడే విధంగా ఇంజనీర్లుగా తయారై మంచి పరిశ్రమలు స్థాపించి దేశానికి ఆదర్శంగా నిలవాలని జేఎన్టీయూకే ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ విద్యార్థులకు సూచించారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు వారి తల్లితండ్రులకు నిర్వహించిన ఓరియంటేషన్ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పీహెచ్‌డీ రామకృష్ణ ఆన్‌లైన్‌లో మాట్లాడారు. వీసీ డాక్టర్ మురళీకృష్ణను కళాశాల యాజమాన్యం తరపున ఘనంగా సత్కరించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, పలు విభాగాల హెడ్స్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

తణుకు, జూలై 31: జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని నాల్గో అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి డి.సత్యవతి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఈనెల 14న జిల్లాలో కోర్టులున్న చోట అదాలత్‌లు నిర్వహిస్తారన్నారు. రాజీపడే కేసులు, చెక్ బౌన్సు, బ్యాంకు బకాయి, యాక్సిడెంట్, గృహ హింస, సివిల్, ప్రామిసరీ కేసులు రాజీ చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జనసేన సభ్యత్వానికి శ్రీనివాస్ ఆర్థిక సాయం



జనసేన సభ్యత్వ నమోదు చేస్తున్న పార్టీ శ్రేణులు

ఆచంట, జూలై 31 : జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆచంట నియోజకవర్గంలో జోరుగా కొనసాగుతుంది. పార్టీ శ్రేణులు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తిరుగుతూ పలు సెంటర్లలో టెంట్లు వేసి సభ్యత్వాలు నమోదు చేయిస్తున్నారు. ఆచంటకు చెందిన జనసేన పార్టీ నాయకుడు మండెల శ్రీనివాస్ ఆర్థికంగా వెనుకబడిన వికలాంగులకు, పారిశుధ్య కార్మికులకు 40 మందికి ఉచితంగా సభ్యత్వ నమోదు నిమిత్తం రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. శ్రీనివాస్‌ను జనసేన శ్రేణులు అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మికం

వేడుకగా మావుళ్ళమ్మ వార్షికోత్సవం


మావుళ్ళమ్మ గ్రామోత్సవం

ఆచంట, జూలై 31 : ఆచంట నటరాజ్ థియేటర్ వీధిలో ఉన్న మావుళ్ళమ్మ ఆలయ వార్షికోత్సవం వేడుకగా జరిగింది. బుధవారం అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. తీన్‌మార్ డప్పులు, ఆశాదుల నృత్యాలతో గ్రామ పురవీధులు మీదుగా వేడుకగా జరగ్గా కమిటీ నిర్వహకులు ఏర్పాట్లు చేశారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె

ఆకివీడు, జూలై 31 : దుంపగడపలో మారెమ్మ-వెంకమ్మ దేవస్థానంలో గ్రామస్థులు, మహిళలు ఆషాఢమాస సారెను బుధవారం సమర్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, పెద్దలు కొట్టు అంజనేయులు తదితరులు ఉన్నారు.

దాసాంజనేయుడి హుండీ ఆదాయం రూ.2.12 లక్షలు

భీమవరంటౌన్, జూలై 31 :పట్టణంలోని దాసాంజనేయస్వామి ఆలయంలో బుధవారం హుండీల సొమ్మును లెక్కించగా 2లక్షల 12వేల 684 రూపాయలు ఆదాయం వచ్చిందని ఆలయ ఆవో గొట్టుముక్కల నాగసీతారామరాజు తెలిపారు. నాలుగు నెలల 12 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఈ లెక్కింపును యనమదుర్రు దేవస్థానం ఈవో కె.శ్రీనివాసరావు పర్యవేక్షించగా దేవస్థానం మాజీ ఛైర్మన్ ఎం.శ్యాంసుదరరావు తదితరులు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం కార్యవర్గ ఎన్నిక

తణుకు, జూలె 31: తణుకు పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా కొట్టాపి శ్రీనివాసు, రౌతు గణపతి, సలహాదారులుగా కొట్టాపి నాగేశ్వరరావు, తాడి రామకృష్ణ, జామి నాగ సన్యాసిరావు, అధ్యక్షుడిగా ఆతవ శ్రీనివాసు, కార్యదర్శిగా జామి శ్రీనివాసు, సంయుక్త కార్యదర్శిగా కోడూరి శివ దుర్గారావు, కోశాధికారిగా గాడిల్లి గోపాలరావు, ఉపాధ్యక్షుడిగా భీమవరపు శ్రీను, వర్కింగ్ ఆర్గనైజర్‌గా జామి శేషుతో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే పితాని


ఆచంట వేమవరంలో కుళ్లిన వరి నాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పితాని

ఆచంట/పోడూరు, జూలై 31 : అకాల వర్షాలతో ముంపునకు గురై నష్టపోయిన రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని.. రైతులు అధైర్యపడవద్దని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆచంట మండలం వేమవరం, పెనుమంచిలి, ఆచంట, పోడూరు మండలం తూర్పుపాలెం, మినిమించిలిపాడు గ్రామాల్లో ముంపునకు గురైన నారుమళ్లు, వరి నాట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నారుమడులు దెబ్బతిన్న వాటికి స్వల్ప కాలిక రకాలైన ఎంటీయూ 1153, 1156, పీఆర్ 126 వేసుకోవాలని ప్రభుత్వం తరపున విత్తనాలు రాయితీపై అందిస్తామన్నారు. నష్టపోయిన వరి చేలకు పెట్టుబడి రాయితీ అందిస్తామని నష్టం అంచనాలను త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. వరద బాధితులకు కూటమి అండగా ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆచంట ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, ఏడీఏ ఎ.పార్వతి, పోడూరు మాజీ జడ్పీటీసీ బొక్కా నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి రుద్రరాజు రమేష్‌రాజు, మాజీ ఎంపీటీసీ అరిగెల సత్తిరాజు, తదితర అధికారులు పాల్గొన్నారు.

'వరద తగ్గే వరకు ఇంటింటా సర్వే చేయాలి'

నరసాపురం టౌన్, జూలై 31: వరద తగ్గే వరకు ఇంటింటా సర్వే చేయాలని, జర్వాలు, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమమహేశ్వరావు ఆదేశించారు. బుధవారం పట్టణంలోని పీహెచ్‌సీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత అరుంధతిపేట, కనకదుర్గా గుడి వద్ద ఉన్న పీహెచ్‌పీలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలు, ఓపీ గురించి ఆరా తీశారు. అనంతరం పొన్నపల్లిలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును సందర్శించారు. ఎక్కడైనా జర్వాల సంఖ్య ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యాధికారికి తెలియజేయాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాద్ ఉన్నారు.

మెడికల్ క్యాంపుల్లో.. పర్యవేక్షణ అధికారి తనిఖీ

యలమంచిలి, జులై 31: వరదముంపు ప్రాంతాలైన దొడ్డిపట్ల, బూరుగుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులను జిల్లా నిఘా అధికారి, పర్యవేక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.ధనలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రజలకు నిరంతరం వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. వైద్యసిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న మందులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. డాక్టర్ చంద్రరేఖ తదితరులు పాల్గొన్నారు.

'దళితులపై దాడులు చేస్తే ప్రతిదాడులు తప్పవు'

పాలకోడేరు, జూలై 31: దళితులపై దాడులు చేస్తే ప్రతిదాడులు తప్పవని అంబేడ్కర్ ఆలోచన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవ్వాకుల భరత్ అన్నారు. గొల్లలకోడేరు గ్రామ పంచాయతీ ఆవరణలో సివిల్ రైట్స్‌డే కార్యక్రమాన్ని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, చవ్వాకుల భరత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులు, వివక్షత మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు తదితర సమస్యలపై మాట్లాడారు. సివిల్ రైట్స్‌డే నిర్వహణలో అలసత్వం వహించిన అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. గ్రామ సర్పంచ్ కె.లక్ష్మి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ముత్యాల నాగభూషణం, ఈవోపీఆర్‌డీ రామాంజనేయులు, హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్.రాము, ఎస్ఐ శ్రీనివాసరావు, గ్రేడ్-5 సెక్రటరీ శ్రీవిద్య, వీఆర్వో ఇందిరా పాల్గొన్నారు.

'కమిటీ హాలు నిర్మించండి'

పెనుగొండ, జూలై 31 : పెనుగొండలోని వేంద్ర వీధిలో గల పంచముఖ ఆంజనేయస్వామి సంఘానికి సంబంధించిన స్థలం ఉందని.. ఆ స్థలంలో కమిటీ హాలు నిర్మించాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను కలిసి సంఘ సభ్యులు కోరారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ కమిటీ హాలు నిర్మిస్తానని హామి ఇచ్చి ఏఈని పంపించి హద్దులు, కొలతలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వేంద్ర రాము, పెచ్చెట్టి త్రిమూర్తులు, వేంద్ర కోటేశ్వరరావు, పెచ్చెట్టి సూర్యచంద్రరావు, వేంద్ర నాగేశ్వరరావు, పెచ్చెట్టి దానయ్య ఉన్నారు.

నరసాపురం వనిత క్లబ్‌కు అవార్డులు

నరసాపురం టౌన్, జూలై 31: సామాజిక సేవా కార్యక్రమాల్లో నరసాపురం కాపు వనిత క్లబ్ చేస్తున్న కార్యక్రమాలకు పలు అవార్డులు లభించాయి. పాలకొల్లు అడపాల గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో వనిత క్లబ్‌కు బెస్ట్ కమ్యూనిటీ సర్వీస్, బెస్ట్ పబ్లిక్ ఇమేజ్, సోషల్ సర్వీస్ ఇతర విభాగాల్లో ఐదు అవార్డులు దక్కాయి. బుధవారం క్లబ్ భవనంలో జరిగిన అభినందన సభకు జిల్లా టీడీపీ మహిళా విభాగం అధ్యక్షులు డాక్టర్ రాజ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేసి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులైన పుప్పాల ఉమామహేశ్వరి, బండి స్వర్ణలతను అభినందించారు. ఆర్.భరణి, శశికళ, రాజకుమారి, లక్ష్మి, వెంకటలక్ష్మి, తోట అరుణ ఉన్నారు.

షామియానా సప్లయర్స్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

పాలకొల్లు అర్బన్, జూలై 31 :షామియానా సప్లయర్స్ ఓనర్సు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఏళ్ళ శ్రీనివాసరావు (భీమవరం) ఎన్నికయ్యారు. బుధవారం బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో షామియానా సప్లయర్స్ ఓనర్సు అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా రంకిరెడ్డి బుజ్జిబాబు (పాలకొల్లు), కోశాధికారిగా పట్నాల వెంకటరామకృష్ణ (టీపీగూడెం), ఉపాధ్యక్షులుగా సయ్యద్ చాంద్‌బాషా, యోహానులను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు.

పథకాలకు మహనీయుల పేర్లు .. అభినందనీయం

పాలకొల్లు అర్బన్, జూలై 31 : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం అభినందనీయమని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పథకాలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం వంటి వారి పేర్లు పెట్టినందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాద బాధితుడికి 'జనసేన' సాయం

పెనుగొండ, జూలై 31 :ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో జనసేన ఎప్పుడూ ముందుంటుందని జనసేన మండల అధ్యక్షుడు కొండవీటి శ్రీనివాసరావు అన్నారు. సిద్ధాంత గ్రామ జనసైనికుడు మిరియాల వెంకట శివప్రసాద్ ప్రమాదానికి గురి కావడంతో జిల్లా జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు అందజేసిన రూ. 50 వేల చెక్కును బుధవారం అందజేశారు. జనసేన నాయకులు జవ్వాది బాలజీ, కోయ కార్తిక్, పోలనాటి మల్లికార్జునరావు, అడ్డగళ్ళ నరసింహరావు, బొబ్బిలి శ్రీనివాసరావు, దార్లంక మారుతి, లక్కు వర్మ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

పాలకొల్లు రూరల్, జూలై 31 : ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దూరమవుతాయని చింతపర్రు గ్రామ సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీ పరిధిలోని చింతపర్రులో పీహెచ్‌సీ డాక్టర్ ఎ.ప్రతాప్‌కుమార్ సిబ్బందితో బుధవారం గ్రామం పర్యటించారు. గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రం చేయించి, ముగ్గు, బ్లీచింగ్ చల్లించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఏఎన్‌ఎం అనిత, హెల్త్ అసిస్టెంట్ తారక సత్య, సిబ్బంది గణేష్, ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా ఫెయిర్ వెల్ డే

గణపవరం, జూలై 31: గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2021-24 సంవత్సరం విద్యార్థులు ఫెయిర్‌వెల్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యూనివర్శిటీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వివిధ క్రీడల్లో గెలుపొందిన ప్రతిభావంతులకు ప్రిన్సిపాల్ నిర్మల కుమారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ.. డ్రైవర్‌కు గాయాలు

ఉండి, జూలై 31 : విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. భీమవరం నుంచి ఉండి వైపు వెళ్లే లారీ వేగంగా వచ్చి సివిల్ సప్లయిస్ గొడౌన్ వద్ద వున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ముందు వెళ్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయి స్తంభాన్ని ఢీకొట్టినట్టి స్థానికులు తెలిపారు. ప్రమాదంలో లారీడ్రైవర్ గంగాధర్ స్వల్పగాయాలపాలయ్యాడు.